
సేవలు లేవు.. డబ్బులు రావు

- అన్నదాతలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- మూతపడుతున్న రైతు సేవా కేంద్రాలు
- వ్యవసాయ సిబ్బందికి సర్వేల పేరుతో అదనపు బాధ్యతలు
- నెలదాటుతున్నా ధాన్యం కొనుగోలు డబ్బులు తమ ఖాతాల్లో పడలేదని అన్నదాతల ఆందోళన
- నేటికీ పచ్చిరొట్ట విత్తనాలు అందని దుస్థితి



రాజుపాలెం: కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తోంది. రైతులను పట్టించుకుంటున్న దాఖలా కనిపించడం లేదు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నా ఇంతవరకు పచ్చిరొట్ట విత్తనాలు అందించే పరిస్థితి లేదు. వ్యవసాయ సహాయకులు లేక రైతు సేవా కేంద్రాలు మూతపడుతున్నాయి. ప్రభుత్వం కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి నెలలు కావస్తున్నా తమ ఖాతాలలో చిల్లిగవ్వ పడలేదని రైతులు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 14 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు సకాలంలో సేవలందించేందుకు ప్రతీ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రంగా పేరు మార్చిందే గాని రైతులకు సేవలందించడంలో విఫలమైంది.

వ్యవసాయ సిబ్బందికి అదనపు బాధ్యతలు

వ్యవసాయ శాఖలో పనిచేసే సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించడం వలన రైతు సేవా కేంద్రాలు మూతపడుతున్నాయి. అదనపు బాధ్యతలు అప్పగించడం వలన సిబ్బంది ఎక్కువ సమయం గ్రామ సచివాలయాల్లో ఉండడం వలన రైతు సేవా కేంద్రాలు మూతబడుతున్నాయి. పని నిమిత్తం వచ్చిన రైతులు రైతు సేవాకేంద్రాలు మూసి ఉండటంతో వెనుదిరిగి వెళుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు కరువు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములు, పిల్లి పెసరలు ప్రతీ రైతు భరోసా కేంద్రానికి 50 క్వింటాళ్లు ఇచ్చేవారు. రైతులకు అవి సమృద్ధిగా సరిపోయేవి.. వాటిని మే నెలలోనే అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ రైతు సేవా కేంద్రానికి 10 క్వింటాళ్లు మాత్రమే విత్తనాలను సరఫరా చేసింది. సిబ్బంది అరకొరా వచ్చిన విత్తనాలను రైతులకు అందించలేక సతమతమవుతున్నారు.

ధాన్యం డబ్బుల కోసం ఎదురుచూపులు

మండలంలోని పలు గ్రామాలలో రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు చేశారు. వాటికి సంబంధించి 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు పడాల్సి ఉండగా నెల కావస్తున్నా ఇంత వరకు నగదు జమ కాలేదని రైతులు వాపోతున్నారు.

ధాన్యం నగదు ఇంతవరకు జమకాలేదు



వ్యవసాయ సిబ్బంది ద్వారా కొనుగోలు కేంద్రంలో 15 బస్తాల ధాన్యాన్ని విక్రయించాను. 48 గంటల్లో ఖాతాలో పడాల్సిన డబ్బులు 30 రోజులు కావస్తున్నా ఇంత వరకు జమకాలేదు. డబ్బులు పడతాయో లేదో అని ఆందోళనగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి డబ్బులు జమ చేయాలి.

– జంగాల సామేలు, రైతు, రాజుపాలెం

ఆర్ఎస్కేలకు వచ్చి వెనుదిరిగి వెళుతున్నాం



వ్యవసాయ సిబ్బందికి వ్యవసాయ సేవలేకాక అదనపు సేవలు పురమాయించడం వలన రైతు సేవాకేంద్రాలు తరుచూ మూతపడుతున్నాయి. సిబ్బంది ఆ సర్వేలు, ఈ సర్వేలంటూ గ్రామ సచివాలయంలోనే కాలం వెళ్లదీస్తున్నారు. రైతులు సేవాకేంద్రాలకు వచ్చి వెనుదిరిగి వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు బాధ్యతలు తప్పించాలి.

– పి.నరసింహారావు, రైతు, రాజుపాలెం

కూటమి నిర్లక్ష్యంతో సేవాకేంద్రాలు మూలన..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 14 రైతు భరోసా కేంద్రాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ఆరు గ్రామాలలో పూర్తి కావడంతో ప్రారంభించి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మిగతా 8 గ్రామాలలో వివిధ దశలలో 80 శాతం పూర్తయినా.. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిచేసి ప్రారంభించాలనే ఆలోచన చేయడం లేదు. వాటిల్లో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని రైతు సేవా కేంద్రాలను రూ.వేలు చెల్లించి అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో మండలంలో 14 కియాస్కో యంత్రాలను ఏర్పాటు చేయగా అవి కాస్తా మరుగున పడిపోయాయి.


బలిజేపల్లిలో నిర్మాణం పూర్తికాని రైతు సేవాకేంద్రం

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎంపిక వేగవంతం

- జూలై 7న అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ

క్రోసూరు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, అనుబంధ సంఘాల మండల సమావేశం నందిగామ దేవదాస్ మాదిగ అధ్యక్షతన ఆదివారం క్రోసూరులో జరిగింది. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి దుడ్డు రామకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభినవ అంబేడ్కర్, మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు క్రోసూరు మండలంలోని 16 మాదిగ పల్లెల్లో ప్రతీ ఒక్క గ్రామ ఇన్‌చార్జిలందరూ ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాల నూతన కమిటీ నిర్మాణాలను వేగవంతం చేయాలని, అదేవిధంగా ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ క్రోసూరు మండల మాజీ అధ్యక్షుడు కొడవటి కృపారావు, వేమవరపు జీవన్ మాదిగ, బొక్కా జాన్ పాల్ మాదిగ, గొర్రెపాటి స్వామి మాదిగ, దుడ్డుల అక్కులు మాదిగ, చిలక రవి మాదిగ, రేపూడి ప్రభుదాస్ మాదిగ, చిలక సుల్తాన్ మాదిగ, నందిగామ సతీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుడ్డు రామకృష్ణ మాదిగ

ఉపాధి కూలీలకు వెంటనే పనులు చూపించాలి

అమరావతి: స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలోని ఉపాధి హామీకూలీలకు వెంటనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. ఆదివారం స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వాన్ని ఇంటింటికి తిరిగి చేర్పించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను విన్నవిస్తూ కాలనీలోని ఉపాధి హామీ వేతన దారులు ఈ సంవత్సరం ఒక్కరోజు కూడా పనికి వెళ్లలేదన్నారు. క్షేత్ర సహాయకుడు పనికి రమ్మని అడిగినప్పుడు మిర్చి కోతల పనులు ముమ్మరంగా ఉండటం వలన వెళ్లలేకపోయామని, మిర్చి కోతలు అయిపోయిన తర్వాత పని చూపించాలని అడిగితే పనులు లేవని చెబుతున్నారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక ఉపాధి హామీ పనులు లేక నెల రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటూ ఇబ్బంది పడుతున్నామన్నారు. పని చూపించాలన్నారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ వేతన దారులకు వారు అడిగినప్పుడు పని చూపించాల్సిన బాధ్యత సిబ్బందికి ఉంటుందన్నారు. అలా కాకుండా పనులు లేవని చెప్పటం సరికాదని వెంటనే అందరికి ఉపాధి హామీ పనులు చూపించాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ జాబ్ కార్డు లేనివారికి జాబ్ కార్డులు వెంటనే ఇవ్వాలన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కాసు పూజలు

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో జరిగిన దేవాలయాలు, బొడ్రాయి, ధ్వజస్తంభాల ప్రతిష్ఠా మహోత్సవంలో గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. గ్రామ పొలిమేరల నుంచి కాసుని మేళా తాళాలతో గ్రామంలోకి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కాసుని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెద హనిమిరెడ్డి, నాయకులు మందపాటి రమేష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, కొమ్మినేని వెంకటేశ్వరరావు(కేవీ), కోట కృష్ణ, షేక్ సుభాని, షేక్ జాకీర్ హుస్సేన్, సర్పంచి నెమలికంటి వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకట నాగయ్య పాల్గొన్నారు.


ప్రతిష్ఠించిన ధ్వజస్తంభాల వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


వావిలాల స్మృతి వనంలో ఆసనాలు వేస్తున్న ప్రజలు

మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద కుమార్ అన్నారు. పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యోగాంధ్ర నిర్వహించి, ఆసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో యోగాతో చక్కని ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. యోగాతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాల గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. రోజూ యోగా చేయడం వలన సంతోషంగా, ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలని కోరారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, యోగ అభ్యాసకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

• ఎన్నాళ్లకెన్నాళ్లకు..


అప్పటి గురువులతో 2011-2012 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 2011-2012 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఆనాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు తుమ్మా లూర్దురెడ్డి, కె. చిన్నపురెడ్డి, వై. ఫాతిమా మర్రెడ్డి, బి.థామస్‌లను ఘనంగా సత్కరించారు. విద్యార్థులంతా వేదికపై తమను పరిచయం చేసుకున్నారు. పూర్వమిత్రులను 13 సంవత్సరాల అనంతరం కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలతో కూడిన విద్యకారణంగానే ఉన్నత స్థాయికి చేరుకున్నామని పుల్లా ఫ్రాన్సిస్ తెలిపారు.

ఇర్ఫాన్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ

- కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- డెప్యూటీ సీఎం పవన్‌ను దూషించిన కేసులో ఇర్ఫాన్‌ను అరెస్టు చేసిన పోలీసులు

నరసరావుపేట: మండలంలోని ములకలూరు గ్రామానికి చెందిన మాజీ వలంటీరు ఇర్ఫాన్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను దూషించాడనే కారణంతో ఇర్ఫాన్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి గ్రామానికి వెళ్లి అతడి కుటుంబాన్ని పరామర్శించారు. తల్లిదండ్రులు, భార్యకు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి తెనాలి పర్యటన సందర్భంగా డెప్యూటీ సీఎంను దూషిస్తూ ఇర్ఫాన్ మాట్లాడాడని కేసు పెట్టారని తెలిపారు. అతడు గత ప్రభుత్వంలో వలంటీర్‌గా ఎంతో బాగా పని చేశాడని పేర్కొన్నారు. ఇర్ఫాన్ అరెస్టుపైన, అతడ్ని కేసు నుంచి బయటికి తీసుచ్చేందుకు పార్టీకి చెందిన లీగల్ టీంతో సంప్రదింపులు చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం సంబంధిత కోర్టులో బెయిల్ పిటిషన్ వేసి విడుదల కోసం ప్రయత్నిస్తామని, అవసరమైతే హైకోర్టు కూడా వెళతామని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇర్ఫాన్ తండ్రి కరిముల్లాతో పార్టీ అగ్రనేతలు సజల రామకృష్ణారెడ్డి, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడి తెలియచేశారన్నారు. ఇర్ఫాన్‌కి ఏమి జరగకుండా కుటుంబానికి అప్పజెప్పే బాధ్యత పార్టీ తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, నాయకులు షేక్ కరిముల్లా, బూదాల కల్యాణ్, సయ్యద్ ఖాదర్‌బాషా, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


ఇర్ఫాన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వైభవంగా అద్దంకమ్మ తల్లి జాతర



శావల్యాపురం: మండలంలోని చినకంచర్లలో గల శ్రీ అద్దంకమ్మ తల్లి కొలుపుల జాతర ఆదివారంతో ముగిసింది. మహిమ కల్గిన తల్లి జాతరను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 6న ప్రారంభమైన ఉత్సవాల చివరి రోజు ఉదయం దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. పసుపు–కుంకుమ నూతన వస్త్రాలను అందజేశారు. సాయంత్రం పండుగ వాతావరణంలో కులమతాలు పార్టీలకు అతీతంగా బోనాలను తలపై పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. కుంకుమ బండ్లను ఊరేగింపుగా మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, పూలదండలతో అలంకరణ చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలదండలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

క్లుప్తంగా

హిందూ హైస్కూల్‌లో షెడ్ నిర్మాణానికి విరాళం



అమరావతి: గత 75 సంవత్సరాలుగా అమరావతి పరిసర గ్రామాల్లో ఎంతో మందికి విద్యను అందించిన శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్రుడు కోనూరు కోటేశ్వరరావు, వాణి దంపతులు పాఠశాలకు రూ.6లక్షలు విరాళమందించారు. పాఠశాలలో ఓపెన్ ఆడిటోరియం ఎదురుగా ఉండే ప్రదేశంలో షెడ్ నిర్మాణానికి ఈ నగదు వినియోగిస్తున్నట్లు పాఠశాల యజమాన్యం తెలిపింది. ఈక్రమంలో ఆదివారం ఉదయం కోనూరు కోటేశ్వరరావు సోదరులు కోనూరు అప్పారావు, దేవీప్రసాద్ చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అధికారుల సమావేశం

ముప్పాళ్ళ: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజుఉదయం యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో జరిగే యోగా కార్యక్రమాలను ఆయా గ్రామాల వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని సూచించారు. ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగించాలన్నారు. యోగా వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. 9వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది హాజరు కావాల్సి ఉందన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రూపవతి, ఆర్ఐ ఆంజనేయులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో అనుపాలెం ప్రెస్సీ టీం విజయకేతనం



రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో ఎస్సీ యూత్ ఆధ్వర్యంలో మే 14వ తేదీ నుంచి జరుగుతున్న మండలస్థాయి ప్రీమియర్ లీగ్ సీజన్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొత్తం ఏడు టీమ్‌లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో నకరికల్లు టీంపై అనుపాలెం ప్రెస్సీ టీమ్ విజయం సాధించి, విజేతగా నిలిచింది. ఆ జట్టుకు రూ.30వేలను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి, గుంటుపల్లి రమణలు సంయుక్తంగా అందించారు. ద్వితీయ బహుమతి నకరికల్లు టీమ్ కై వసం చేసుకుంది. ఈ టీమ్‌కు రూ.20లను ప్రెస్సీ వాటర్ ప్లాంట్‌వారు అందించారు. తృతీయ బహుమతి కుంకలగుంట టీమ్ కైవసం చేసుకోగా వీరికి రూ.10వేలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కోటినాగిరెడ్డిలు అందించారు. మందా రవి, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

నరసరావుపేట: సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని జిల్లా కో–ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. స్థానిక కంభంపాలెంలో ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షులు కలపాల చరణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బుట్టి మహేంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు బూదాల విజయ్ మాదిగ, విద్యార్థి నాయకులు బూదాల కిరణ్ మాదిగ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఫ్యాన్లు ఏర్పాటు

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్(ఏపీఎస్ఈసీఎం) సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం ఏడు సీలింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేసిందని డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు. దీని వల్ల తమకు విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో 30 స్టీల్ బెంచీలు, 12 ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌ను ఎప్పటికప్పుడు ఊడ్చి శుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు. ప్రయాణికులంతా ఆర్టీసీ సంస్థను ఆదరించి బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు.

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ: కారంపూడి రోడ్డులో గల బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ పి.రత్నకుమారి తెలిపారు.ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్, పలు ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు, ఈబీసీ కేటగిరికి చెందిన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8639189463 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

పట్టణాభివృద్ధికి కృషి

మాచర్ల రూరల్: పట్టణంలోని 7వ వార్డులోని కిడ్స్ పాఠశాల వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, యర్రాకుల సిద్దమ్మ, టీడీపీ నాయకులు వై.కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, గట్ల కోటిరెడ్డి, కమిషనర్ డి.వేణుబాబు, కేసీపీ సిమెంట్స్ జీఎం వెంకటరమణ, నారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి వారధి ఫౌండేషన్ అండ

దాచేపల్లి: నిరుపేద విద్యార్థినికి వారధి ఫౌండేషన్ అండగా నిలిచింది. మండలంలోని శ్రీనగర్‌కి చెందిన పులిపాంగు సాగర్ కుమార్తె శ్రావణి చదువు నిమిత్తం ఫౌండేషన్ ద్వారా వ్యవస్థాపకులు తగరం ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. శ్రావణి డిప్లొమా చదువుతోంది. ఆమె తండ్రి సాగర్ అనారోగ్యంతో ఇటీవల చనిపోయాడు. దీంతో శ్రావణి చదువులకు ఆటంకం కలిగింది. విషయం తెలుసుకున్న వారధి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తరగం ఆనంద్‌కుమార్ ఈ ఏడాది ఫీజుకు సంబంధించి రూ.74,500ను నేరుగా కళాశాల యాజమాన్యానికి చెల్లించారు.

లబ్ధిదారులకు వ్యాక్యూమ్ ట్రక్కు అందజేత



నరసరావుపేట: జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ సర్వీసెస్ కో–ఆపరేటివ్ సొసైటీ నిధులతో మంజూరైన డిసాల్టింగ్ వ్యాక్యూమ్ ట్రక్కును ఆదివారం ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దాపూడి విజయ్‌కుమార్, రంగిశెట్టి రామకృష్ణ, కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, పులిమి రామిరెడ్డి, గూడూరు శేఖర్ పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమిని రైతు దినోత్సవంగా ప్రకటించాలి

నూజెండ్ల: రానున్న ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ప్రభుత్వం ఉత్తమ రైతు పురస్కారాలు అందించాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు.మండలంలోని గొల్లపాలెంలో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి నాడు రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి, పొలం పనుల్ని సంప్రదాయకంగా ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు ఏరువాకను ప్రభుత్వం రైతు దినోత్సవంగా ప్రకటించి వ్యవసాయంలో ఎక్కువ దిగుబడులు తెచ్చిన యువ రైతులకు మండల స్థాయిలో ఉత్తమ రైతు అవార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దారావు, అంజయ్య, సాంబశివరావు ,రైతులు పాల్గొన్నారు.